

# స్వచ్ఛ సమాజం.. కార్మిక కల్యాణం

ఈనాడు, తిరుపతి

- తిరుపతిలో ముఖ్యమంత్రి వరాల జల్లు
- స్వచ్ఛ ఆంధ్ర సాధకులకు పురస్కారాలు
- శ్రామికులకు బీమా పథకాలు

"జాతిపిత మహాత్ముని జయంతి వేడుక రోజున ఓ సత్సంకల్పాన్ని నిర్దేశించుకున్నాం.. యావత్ నవ్యాంధ్రను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని తలచాం.. ప్రజాభాగస్వామ్యంతో దీన్ని సాకారం చేద్దాం. మరుగుదొడ్ల నిర్మించేందుకు నిధుల కొరత లేదు. ప్రతీ కుటుంబం విధిగా స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణంలో మమేకం కావాలి.. కార్మికుల జీవితాలకు అవసరమైన భద్రత, భరోసా కల్పిస్తాం.. వారికి అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపుతాం.."

**- తిరుపతి వేదికగా నిర్వహించిన వివిధ సభల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.**

**ముఖ్య**మంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం తిరుపతిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారు. వివిధ వర్గాలపై వరాల జల్లు కురిపించారు. ఉదయం 11గంటలకు విచ్చేసిన ఆయనకు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. మంత్రి నారాయణ, డీఐజీ ప్రభాకరరావు, జిల్లా పాలనాధికారి

... మిగతా 7లో

# స్వచ్ఛ సమాజం.. కార్మిక కల్యాణం

**(మొదటి పేజీ తరువాయి)** సిద్ధార్థజైన్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, కమిషనర్ వినయ్‌చంద్, తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. అక్కడినుంచి తిరుపతికి బయల్దేరిన ఆయన వాహన శ్రేణి తిరుచానూరు వద్ద పైలట్ నిర్లక్ష్యంతో దారి తప్పిం.. కాసేపు గందరగోళం నెలకొంది. అప్రమత్తమైన ఉన్నతాధికారులు తప్పు తెలుసుకొని మళ్లీ నిర్దేశిత మార్గంలో పంపారు. మార్గమధ్యంలో ఆయనకు దారిపొడవునా స్థానికులు స్వాగతం పలికారు. గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పరిశుభ్రతకు సంబంధించి రూపొందించిన శకటాన్ని పరిశీలించారు. స్వచ్ఛనినాదాలతో చేపట్టిన ప్రదర్శనను సైతం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మహతి కళాక్షేత్రానికి చేరుకుని ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం.. బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరాలుగా ఎంపికైన వాటికి అవార్డులు అందించి ప్రశంసించారు. మహతిలో జనవాహిని పోటెత్తింది. వారిని కూర్చోబెట్టేందుకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి రామాంజనేయులు శ్రమించాల్సి వచ్చింది. వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎల్‌ఈడీ తెరలపై చూపిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు చేతులమీదుగా అవార్డులు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ థర్డ్‌పార్టీ కంట్రోల్ ప్రతినిధులు అనయ్ అగర్వాల్, జీఐజడ్ ప్రతినిధి వాల్టర్ ఎంపికైన నగరాలు, పట్టణాలకు ఓడీఎఫ్ ధృవపత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అందజేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో మహతి నుంచి శ్రీ పద్మావతీ అతిథిగృహానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సాయంత్రం 4.15గంటలకు తారకరామా స్టేడియానికి చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన చంద్రన్న బీమా పథకం బహిరంగ సభలో ప్రసంగించారు. కార్మికులకు కల్పించిన బీమా సదుపాయాన్ని తిరుపతి నుంచే ప్రారంభించారు. అందరికీ తాము అండగా ఉంటామని.. భద్రత, భరోసా ఇస్తామని మంత్రి అచ్చెన్నాయుడు, కార్మికశాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రకటించారు. ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎమ్మెల్యే సుగుణమ్మ ముఖ్యమంత్రి చంద్రబాబును శాలువా, జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

తారకరామా మైదానం కార్మికులు, ప్రజలతో పోటెత్తింది. ఎండను లెక్క చేయకుండా మహిళలు కిక్కిరిసి కూర్చున్నారు. సాయంత్రం ఆరుగంటల సమయంలో సభ ముగియగానే ముఖ్యమంత్రి చంద్రబాబు విమానాశ్రయానికి వెళ్లారు. ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పట్టువస్త్రాలను సమర్పించేందుకు ముఖ్యమంత్రి దంపతులు సోమవారం మధ్యాహ్నం తిరుమలకు విచ్చేయనున్నారు.